క్లుప్తంగా

విద్యార్థి దశ చాలా కీలకమైనది



పెనమలూరు: మానవ జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని కృష్ణా జిల్లా యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని లక్ష్య సాధన కోసం చదవాలని కోరారు. పరీక్షలపై ఆందోళన చెందే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, పర్సనాలటీ డెవలప్మెంట్ కార్యక్రమంతో విశ్వాసం పెంపొందిస్తామన్నారు. సైకాలజిస్టు శ్రీపతి జగదీష్, డీన్ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణకు మాతృభాషే మేలు



గన్నవరం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి, బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం కవితా పఠనం, సెమినార్ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కవయిత్రి కోడె యామిని మాట్లాడుతూ భావ వ్యక్తీకరణలో మాతృభాషకు మించిన భాష మరొకటి లేదన్నారు. ఇంగ్లీషుతో పాటు మాతృభాషలో పిల్లలు రాణించే విధంగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని చెప్పారు. ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు, వక్తలు కర్ర వరప్రసాద్, కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్, విభాగాధిపతులు కృష్ణమోహన్, మురళీకృష్ణ, సీనియర్ అధ్యాపకులు వీఏ ఎలీషా తదితరులు పాల్గొన్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి

పెనమలూరు: యువత అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సేవా సంస్థ సమన్వయకర్త కె.బలరామకృష్ణ అన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మానవ అక్రమ రవాణా, వాణిజ్యపరమైన లైంగిక దోపిడీ పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు ప్రేమ, సినిమా అవకాశాలు, మోడలింగ్, గల్ఫ్లో ఉద్యోగాలు, ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ వంటి మోసాలకు గురవుతున్నారని తెలిపారు. బాల, బాలికలు, యువత ఇటువంటి మోసాలకు గురి కాకుండా ఉండటానికి తమ సంస్థ అవగాహన సదస్సులు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వై.చంద్రయ్య, వినోద్, దేవకరుణ, హెచ్ఎం ఆర్.కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జమున ఎంపిక

ఉంగుటూరు: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు మానికొండ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బండారు జమున అర్హత సాధించినట్లు హెచ్ఎం జి.పద్మవాణి తెలిపారు. స్థానిక పాఠశాలలో ఎంపికైన విద్యార్థినికి అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈ నెల 20న మచిలీపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రభుత్వ పాఠశాలల వైజ్ఞానిక ప్రదర్శనలో 9వ తరగతి విద్యార్థిని జమున ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్ థీమ్నందు ద్వితీయస్థానం పొందిందన్నారు. విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటుందన్నారు.

150 మంది వృద్ధులకు కంటి పరీక్షలు



కంకిపాడు:కంటి సమస్యలకు ప్రాథమిక దశలోనే వైద్యం పొందాలని ఉప్పలూరు పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పలూరు పీహెచ్సీ ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద అవ్వాతాతలు 150 మందికి మంగళవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వివి రాజేష్కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ సుందర్కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక దశలో సమస్యలను గుర్తించి వైద్యం చేయించుకోవటం ద్వారా దృష్టి లోపాలను నివారించవచ్చని చెప్పారు. ఎంపీహెచ్ఈఓ భాస్కర్రెడ్డి, సిబ్బంది మాలతి, రాచమళ్ల శ్యాంప్రసాద్, కెనడీబాబు, షాజిదా బేగం పాల్గొన్నారు. ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అధునాతన వసతులతో అందరికీ వైద్యం

- కంకిపాడు సీహెచ్సీలో సేవలకు సర్వం సిద్ధం
- రూ.4.60 కోట్ల అంచనాతో నూతన భవనం నిర్మాణం
- ఈ నెల 24న ప్రారంభానికి ముహూర్తం ఖరారు
- అక్కినేని గోపాలకృష్ణమూర్తి-సుగుణ సామాజిక ఆరోగ్య కేంద్రంగా నామకరణం



కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం



వైఎస్సార్ ఆరోగ్యశ్రీ విభాగం

కంకిపాడు: ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. అందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పెద్ద ఎత్తు నిధులు కేటాయించి ఆస్పత్రులను అభివృద్ధి చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల మొదలుకొని పట్టణాలు, నగరాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మార్చేస్తుంది. ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంది. నిపుణులైన వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టుల పోస్టులను భర్తీ చేసింది. అందులో భాగంగా కంకిపాడులో అధునాతన వసతులతో సామాజిక ఆరోగ్య కేంద్రం సేవలకు సర్వం సిద్ధమైంది. ఆసుపత్రి నూతన భవనం నిర్మాణం పూర్తయింది. ఈ నెల 24వ తేదీన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం కంకిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలోనే సామాజిక ఆరోగ్య కేంద్రం సేవలు అందుతున్నాయి. 2010 తరువాత పీహెచ్సీ నుంచి సీహెచ్సీగా అప్గ్రేడ్ చేశారు. ఆ మేరకు నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించారు. ప్రస్తుతం గైనకాలజీ, పిడియాట్రిక్, మత్తు, జనరల్, జనరల్ సర్జరీ సేలు అందుబాటులోకి వచ్చాయి. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన ఎనిమిది మంది వైద్యులు స్థానికంగా విధుల్లో ఉన్నారు. కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు పరిసర ప్రాంతాలకు చెందిన 250 నుంచి 300 మంది ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందుతున్నాయి. తాజాగా హెర్నియా, హైడ్రోసిల్, పైల్స్ సర్జరీలు కూడా అందుబాటులోకి రావటంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతుంది.

రూ 4.60 కోట్లతో నూతన భవనం నిర్మాణం...

సామాజిక ఆరోగ్యకేంద్రంగా అప్గ్రేడ్ అయిన నేపథ్యంలో కంకిపాడుకు చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి అక్కినేని గోపాలకృష్ణమూర్తి బైపాస్ మార్గానికి వెంబడి ఉన్న విలువైన 1.69 ఎకరాల భూమిని 2019 సెప్టెంబరులో ఆసుపత్రికి వితరణగా అందించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య సేవలకు ప్రాధాన్యత ఇస్తూ నూతన ఆసుపత్రుల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఇందులో భాగంగానే రూ.4.60 కోట్లు నిధులు మంజూరు చేశారు. 2020 నవంబరు 4న ఎమ్మెల్యే పార్థసారథి నూతన ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణ సంస్థ ఆసుపత్రి భవన నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. ఆసుపత్రిలో 30 పడకలతో పాటుగా, ఆరోగ్యశ్రీ విభాగం, డిస్పెన్సరీ, స్టోరేజ్ యూనిట్లను, వైద్య విభాగాలకు అవసరమైన గదులను నిర్మించారు. అత్యవసర వేళల్లో అగ్ని ప్రమాదాన్ని నివారించేందుకు అవసరమైన అగ్నిమాపక యూనిట్ను సైతం అందుబాటులోకి తెచ్చారు. ఆసుపత్రి భవనంకు వెళ్లే మార్గాన్ని సిమెంటు రోడ్డుగా అభివృద్ధి చేసి ఎల్ఈడీ లైట్లను ఏర్పాటుచేశారు.

ఈ నెల 24న ప్రారంభోత్సవం...

ఆరోగ్య కేంద్రానికి స్థల దాత అక్కినేని గోపాలకృష్ణమూర్తి-సుగుణ సామాజిక ఆరోగ్యకేంద్రంగా నామకరణం చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జిల్లా అధికారుల నుంచి వెలువడ్డాయి. సిద్ధమైన ఆసుపత్రి భవనాన్ని ఈ నెల 24వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమానికి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హాజరుకానున్నారు.



సీహెచ్సీ భవనంలో అందుబాటులో ఉన్న వార్డు



ఆసుపత్రి లోపల వివిధ విభాగాలు

విస్తృతంగా వైద్య సేవలు



నూతన భవనం సర్వం సిద్ధమైంది. అన్ని వసతులతో విభాగాలను ఏర్పాటుచేశారు. నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు. విస్తృతస్థాయిలో ఈనెల 24వ తేదీ నుంచి నూతన భవనంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలి.

– డాక్టర్ సంజయ్, వైద్యాధికారి, సామాజిక ఆరోగ్య కేంద్రం, కంకిపాడు

రైతుల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్



ఉంగుటూరులో కేడీసీసీ బ్యాంకు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీ, తన్నీరు



కేడీసీసీ బ్యాంక్ బ్రాంచ్కు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ

ఉంగుటూరు: రైతులకు ఆర్థిక సహకారం అందిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, కేడీసీసీబి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రమైన ఉంగుటూరులో రూ.1.03 కోట్లతో చేపట్టనున్న కేడీసీసీ బ్రాంచి నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే, కేడీసీసీ చైర్మన్ తన్నీరుతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ పెట్టుబడులు, రైతుల ఆర్థిక లావాదేవీలకు ఇబ్బందులు కలుగకూడదనే ఉద్దేశంతో గతంలో ఉంగుటూరులో బ్రాంచ్ని పునఃప్రారంభించామని పేర్కొన్నారు. మెరుగైన సేవలు అందించేందుకు నూతన భవనం నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. గన్నవరం ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీ కుమారి, ఎంపీపీ వడ్లమూడి సరోజిని, కేడీసీసీ డైరెక్టర్ పి.సుజాత, సర్పంచ్ కాటూరి వరప్రసాద్, ఎంపీటీసీ సింహాచలం, సీఈఓ శ్యామ్ మనోహర్, డీజీఎం ప్రభాకర్, ఏజీఎం శ్రీనివాసరావు, ఉంగుటూరు బ్రాంచ్ మేనేజర్ సాంబశివరావు, కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, ఉంగుటూరు సొసైటీల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులు, మహిళలకు పెద్దపీట

హనుమాన్జంక్షన్ రూరల్: రైతులు, డ్వాక్రా మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పెద్దపీట వేస్తుందని ఆ బ్యాంక్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ పరిశీలకుడు తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. రూ.1.27 కోట్ల వ్యయంతో చేపట్టిన కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ హనుమాన్జంక్షన్ బ్రాంచ్ నూతన భవన నిర్మాణానికి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్తో కలిసి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మాట్లాడుతూ తన్నీరు నాగేశ్వరరావు నేతృత్వంలో కేడీసీసీ బ్యాంకు శరవేగంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని ఉంగుటూరు, హనుమాన్జంక్షన్ బ్రాంచ్ల నూతన భవ నాలకు నిధులు మంజూరు చేయటంపై ధన్యవాదాలు తెలిపారు. అనంతరం 10 డ్వాక్రా గ్రూపులకు రూ.1.12 కోట్ల రుణాలను చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైస్ ఎంపీపీ సర్పంచ్ సరిపల్లి కమలా భాయి, ఎంపీటీసీ సభ్యులు నూకల జ్యోతి, మత్తి లక్ష్మీ మాధవి, కొనకళ్ల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్చైర్మన్లు యర్రం శెట్టి రామాంజనేయులు, మూల్పూరు ప్రభుకాంత్, వెంకటరత్నం, అల్లాడి థెరిస్సా, కేడీసీసీ బ్యాంక్ సీఈవో శ్యామ్ మనోహర్, హనుమాన్జంక్షన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మల్లి సాహితి పాల్గొన్నారు.

డంపింగ్యార్డు సమస్య పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- రూ.3.60 కోట్లతో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: డంపింగ్ యార్డును ఏర్పాటు చేసి చెత్త సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. పోరంకి వద్ద స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, తాడిగడప మున్సిపాలిటీ నిధులు రూ.3.60 కోట్లతో ఏర్పాటు చేసిన చెత్త ప్రాసెసింగ్ ప్లాంట్ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తాడిగడప మున్సిపాలిటీ దినదినాభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ ప్రాంతంలో దాదాపు 2 లక్షల మంది జనాభా ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రతి రోజూ 250 టన్నుల చెత్త సేకరణ జరుగుతుందని తెలిపారు. గతంలో చెత్త పోరంకిలోని రియల్ వెంచర్లలో వేసేవారని, అది చాలా ఇబ్బందికరంగా మారటంతో ప్రభుత్వ స్థలంలో డంపింగ్యార్డు ఏర్పాటు చేశారన్నారు. ఈ డంపింగ్ యార్డు వలన పరిసర ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం డంపింగ్ యార్డుకు రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసిందని, అయితే స్థలం కొనుగోలు చేసే సమయంలోనూ చాలా మంది అభ్యంతరాలు వ్యక్తం చేయటంతో సమస్య తలెత్తుతుందన్నారు. త్వరలో భూసేకరణ చేసి డంపింగ్ యార్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. బయోరిమిడేషన్, బయో మైనింగ్ పద్ధతిలో వ్యర్థాలను ప్రాసెసింగ్ చేస్తామన్నారు. ఎన్జీటీ నిబంధనలకు అనుగుణంగా ప్రాసెసింగ్ ఉంటుందని వివరించారు. ప్రాసెసింగ్ అయిన చెత్తను విద్యుత్ ప్లాంట్కు, మట్టిని పల్లపు ప్రాంతాల్లో మెరకకు ఉపయోగిస్తామని పేర్కొన్నారు. కమిషనర్ ప్రకాశరావు, ప్లాంట్ ఇన్చార్జి రఘు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, అర్జు న్రెడ్డి, నల్లమోతు జీవన్, అద్దేపల్లి చందు, బందెల రాజు, రచ్చా వెంకటేశ్వరరావు, నేరెళ్ల బుజ్జి, మాదు రమేష్, బబ్లూ, పలువురు పాల్గొన్నారు.

స్పందన దరఖాస్తులు పెండింగ్లో ఉంచొద్దు

విజయవాడరూరల్: స్పందన దరఖాస్తులు పెండింగ్లో ఉంచవద్దని తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. కార్యాలయంలో మంగళవారం ఆమె వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన స్పందన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పు చేసుకొనేందుకు వచ్చిన దరఖాస్తులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. స్టూడెంట్స్ రీచ్ దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకొని వెంటనే అందచేయాలని కోరారు. పట్టాదారు పాస్పుస్తకాల కోసం వచ్చిన వాటిని వెంటనే కార్యాలయానికి పంపాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్లో పెట్టుకోవద్దన్నారు. డెప్యూటీ తహసీల్దారు విజయ్కుమార్, మండల సర్వేయర్ రమేష్, ఆర్ఐ, వీఆర్వోలు పాల్గొన్నారు.

కానూరులో యువతి అదృశ్యం

పెనమలూరు: కానూరులో యువతి అదృశ్యం కావటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మురళీనగర్కు చెందిన చోరగుడి రమేష్ కటుంబ సభ్యులతో ఉంటూ కూలీ పనులు చేస్తాడు. అతని కుమార్తె (22) సోమవారం రాత్రి ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమె కోసం వెతికినా ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో మంగళవారం నూజివీడు నవజీవన్ బాల భవన్ సొసైటీ ఆధ్వర్యంలో మత్తును వదలండి, విముక్తిని పొందండి అంటూ ప్రచారం నిర్వహించారు. మత్తు పదార్థాల మహమ్మారికి బానిసలు అయిన వారు, ఈ వ్యసనంతో అనేక చెడు మార్గాల్లో నడుస్తున్న వారు విముక్తి పొందేందుకు బోస్కో డి-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా, సామాజిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని మత్తు నుంచి రక్షించేందుకు ఈ సెంటర్ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రచారం చేశారు.

లే అవుట్లో వసతుల కల్పనకు చర్యలు

కంకిపాడు:జగనన్న లే అవుట్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని గొడవర్రు గ్రామ సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ తెలిపారు. గొడవర్రు గ్రామంలోని కంకిపాడు-1, 2, గొడవర్రు, మద్దూరు లే అవుట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. వరి పొలాలకు వదిలిన నీరు లే అవుట్లోని కొన్ని ప్లాట్లలోకి ప్రవేశించి నిర్మాణ పనులు జాప్యం అవుతున్నాయంటూ అందిన ఫిర్యాదులపై లే అవుట్ను సందర్శించారు. సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ మాట్లాడుతూ లే అవుట్లో వసతుల కల్పన, సమస్యలపై పంచాయతీ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. యుద్ధ ప్రాతిపదికన ప్రధాన, అంతర్గత రహదారులకు అనుసంధానంగా తూములను రూ.60 వేలు అంచనా వ్యయంతో ఏర్పాటుచేశామన్నారు. దాళ్వా పొలాల్లో మురుగు కాలనీలోకి ప్రవేశించకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా బోదెల తవ్వకానికి ప్రతిపాదనలు చేశామన్నారు.

ఆర్థిక భరోసాతో లబ్ధిదారుల ఆనందం

కానూరులో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో తమకు ఆర్థిక భరోసా దొరికిందని లబ్ధిదారులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేస్తున్న అనేక పథకాలతో తమకు లబ్ధి కలిగిందని అంటున్నారు. కానూరులో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో పలువురు లబ్ధిదారులు తమకు అందిన ఆర్థిక సాయం గురించి మాట్లాడారు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత తమ కష్టాలు తీరాయని కానూరు మురళీనగర్కు చెందిన ఎ.సుజాతమ్మ ఆనందం వ్యక్తం చేసింది. వివిధ పథకాల కింద తనకు రూ.5.10 లక్షలు ఆర్థిక సాయం నేరుగా తన బ్యాంకు ఖాతాలో జమ అయిందని తెలిపింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే భరోసా ఏర్పడిందని లబ్ధిదారుడు దూళిపూడి బాబూరావు అన్నాడు. పథకాల ద్వారా తనకు రూ.5,11,414 ఆర్థిక సాయం అందిందని సంతోషం వ్యక్తం చేశాడు. మురళీనగర్ ప్రాంతంలో దాదాపు 175 గడపలు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా లేదా అని ఎమ్మెల్యే పార్థసారథి తెలుసుకున్నారు. స్థానికులు తమకు దోమల బెడద ఉందని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే పార్థసారథి వెంటనే స్పందించి దోమలు మందు పిచికారీ చేయించాలని, డ్రెయినేజీలో ఆయిల్బాల్స్ వేయాలని అధికారులను ఆదేశించారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన..

రాష్ట్రంలో సంక్షేమ పాలన అమలవుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. చంద్రబాబులా మోసపూరిత పాలన జగనన్నకు తెలియదన్నారు. అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి, అంగిరేకుల సీతారామయ్య, వేమూరి బాలకృష్ణ, ఖాదర్, సిద్ధిఖ్, చాంద్బాషా, తాళ్ల నరేంద్ర, అన్నే శ్రావణ్, నేరెళ్ల బుజ్జి, సింహాద్రిరాజు, కాట్రగడ్డ శ్రీను, యువరాజు, కె.రమేష్, మస్తాన్, శ్రీనివాసరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

కంకిపాడు: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ గన్నవరం ఏడీఏ ఎం.సునీల్ స్పష్టంచేశారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈడుపుగల్లులోని శ్రీనివాసా ఫెర్టిలైజర్స్, కంకిపాడులోని బాలభారతి ఆగ్రోస్, శ్రీ లక్ష్మీ ఏజెన్సీస్లో విస్తృత తనిఖీలు చేశారు. ఏడీఏ సునీల్ మాట్లాడుతూ పురుగు మందులు, ఎరువులు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరూ రశీదులు పొందాలని సూచించారు. ఎరువులు తూకం వేసుకుని కొనుగోలుదారులు పొందాలన్నారు. కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంకిపాడు, గన్నవరం వ్యవసాయాధికారులు పిఎం కిరణ్, తేజస్విని, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు పొందాలి

విజయవాడరూరల్: ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజనలో పేదలకు రూ.5 లక్షల వరకు కేంద్ర ప్రభుత్వం ఉచిత వైద్య సదుపాయం కల్పించిందని వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి డాక్టర్ మాధురిదేవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. డిజిటల్ హెల్త్ గుర్తింపు కార్డు పొందిన వారికి దేశంలో ఎక్కడైనా వైద్య సదుపాయం లభిస్తుందన్నారు. రేషన్ కార్డు కల్గి ఉండి సాధికారిక సర్వే చేయించుకున్న వారిని ప్రభుత్వం ఎంపిక చేసి వారి వివరాలను గ్రామాల్లోని వలంటీర్ల లాగిన్కు పంపించారని చెప్పారు. ఆ సమాచారం ప్రకారం గ్రామాల్లోని వలంటీర్లు, ఏఎన్ఎమ్లు వారి వద్దకు వెళ్లి ఫొటోలు తీసి వివరాలను సబ్మిట్ చేసిన తర్వాత లబ్ధిదారునికి ఐడి నెంబరు వస్తుందన్నారు. దాని ప్రకారం హెల్త్ కార్డులను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి గ్రామంలోని లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వం ఎంపీడీఓ కార్యాలయానికి పంపడం జరిగిందని, అక్కడ నుంచి గ్రామ పంచాయతీలకు వచ్చాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకంలో హెల్త్ కార్డులను పొందాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గంగూరు వద్ద మృతి చెందిన వ్యక్తి

పెనమలూరు: గంగూరు గ్రామ పరిధి విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గంగూరు నలంద పాఠశాల సమీపంలో మంగళవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తి మరణించి ఉన్నాడని గ్రామ వీఆర్వో శాయోజీరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతుడి వయస్సు సుమారు 45-50 సంవత్సరాలు ఉంటాయని, ఎరుపు రంగు చొక్కా , నిక్కరు ధరించి ఉన్నాడన్నారు. అతని తలకు గాయమయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు వెంటనే పెనమలూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

• ఆత్మీయ కలయిక ..



విజయవాడలో మంగళవారం నిర్వహించిన గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ వీడ్కోలు కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డితో కరచాలనం చేస్తున్న ఆర్టీసీ రీజియన్ చైర్మన్ తాతినేని పద్మావతి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పట్టుదల ఉంటే విజయం సాధ్యమే

డీఈఓ. తాహెరా సుల్తానా

కంకిపాడు: పట్టుదల ఉంటే విజయం సాధ్యమేనని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, పునాదిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆమె సందర్శించారు. 6 నుంచి 9వ తరగతి వరకూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల విద్యా ప్రగతిపై సమీక్షించారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధంపై అవగాహన కల్పించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పూర్తి అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో పాటుగా ఒత్తిడిని అధిగమించాలని తెలిపారు. టైం టేబుల్ రూపొందించుకుని ఆ దిశగా లక్ష్యసాధనకు శ్రమించాలని పేర్కొన్నారు.